# జన్మానికల్లా వకటే ముద్దు

"నామాట కొట్టేస్తావా తమ్ముడూ?"

"నువ్వు అలా అంటే నేనేమి చెప్పగలను అన్నయ్యా?"

"చెప్పడానికేమి వుందీ? అంతా తిరస్కారమూ, స్వాతిశయమూను. నాలుగు దినాల నుంచి చెబుతూ వుంటే లక్ష్యపెట్టకుండా వున్నావు-"

"నేను చేయతలచికొన్న పని అకార్యకరణమనే యింకా భావిస్తున్నావా చిన్నన్నయ్యా? నువ్వు పట్టుదలే ప్రధానంగా తలుస్తున్నావు. నువ్వు తెలవనివాడవు కాదు. నేను వివరించి చెప్పవలసింది యేమీ లేదు."

"ఎందుకులే? నీయెదట మేము బుద్ధిహీనులమైపోయినాము-"

"అలాంటిమాట లెందుకంటావు అన్నయ్యా?"

"పుట్టినవంశం యెలాంటిదో, వర్ణం యెలాంటిదో తెలుసుకోనక్కర్లేదూ? పూర్వులంతా యెలా మసులుకున్నారో చూచుకో నక్కర్లేదూ?"

"నువ్వు పెద్దవాడవు కనక యేమన్నా నేను పడవలసిందే; గాని నౌకరీ మన వంశ మర్యాదకి తగినదేనా? అది బ్రాహ్మణ ధర్మాల్లో చేరినదేనా?"

"బుద్ధి తక్కువ వచ్చి నీతో మాట్లాడేను. నన్ను క్షమించు. నీకు మంచీ చెడ్డా చెప్పడానికి మాకర్హత యేమి వుందీ? నాకళ్ళ యెదట పుట్టేవు. మాకందరికీ ధర్మాలు చెబుతున్నావు సరే-"

"ఏమిటో! మనం చెప్పిన మాట వినకపోవడం యేమీ? అన్న అహంకారం తప్ప నీ మాటల్లో మరేమీ అర్థంలేదు. వ్యవసాయంలో పుట్టి మునిగిపోయినట్లు విచారించడానికి కారణం యేమీ లేదు. పెద్దవాళ్ళయినా యుక్తాయుక్త విచారణ చేయకుండా మాట్లాడితే కష్టంగా వుండక మానదు."

"ఔనోయీ. నువ్వు మా పెద్దతనం యేమి అట్టేపెట్టేవూ? చెవులు చిల్లులు పడే మాటలు పలుకుతున్నావు -"

"మీ పై అధికార్లు పలికే మాటలకంటే -"

"ఛీ! నీయెదట నుంచోవడం కూడా బుద్ధితక్కువే."

ఇట్లు చెప్పి రామారావు రెండవ అన్న లోపలకు వెడలిపోయెను. రామారావు హృదయమునకు బల్లెపుపోటు తగిలినట్లయ్యెను.

# 2

అతడు యఫ్‌యే చదువుచు ఇంగ్లీషు మానివేసెను. "నౌకరీ చేస్తేగాని సాగదన్న మాట లేదు. వున్నభూమి వ్యవసాయం చేసుకుంటే భుక్తీ ముక్తీ గూడా వున్నాయి" అని యాతడు నిశ్చయించుకొనియెను. పరీక్షకు దరఖాస్తు చేయవలసిన సమయములో నాతడు ఈనిశ్చయము చేసుకొని కాలేజీ విడిచివచ్చెను.

రామారావునకు ముగ్గురు అన్నలుండిరి. ఆ ముగ్గురును పట్టపరీక్షా సిద్ధులై సర్కారులో పెద్ద నౌకరీలలో నుండిరి. తండ్రి గూడ ఒక జమీందారు వద్ద ఆంతరంగిక మంత్రియై యుండెను. రామారావు మాత్రము అందులకు వ్యతిరేకించెను. తల్లి గూడ అనేకవిధముల చెప్పి చూచెను; గాని ప్రయోజనము కలుగలేదు.

రామారావు తండ్రి రాయవర గ్రామమున పదిపుట్ల భూమిని సంపాదించెను. "నేను చదువు మాని వేశాను. మీరు మీ ఉద్యోగాలు చేసుకొంటూ యథేచ్ఛగా వుండవచ్చును. నేను మన భూమిలో కొంత ఈ యేడు వూడుస్తాను. క్రమంగా మన భూమి అంతా నేనే దున్నుతాను." అని అన్నలకు జాబు వ్రాయగా ముందు పెద్దన్న వచ్చి ఆతని బుద్ధి మఱలింప జూచెను. లాభము లేకపోగా ఆతడు తంతిగొట్టి తక్కినవారిని రావించెను. అందఱును రామారావు ప్రయత్నములను పూర్వపక్షము చేయుటకు ప్రయత్నించిరి. అయినను ప్రయోజనము కలుగలేదు. రామారావు పట్టినపట్టు విడువలేదు. అన్నలకు కోపము వచ్చెను. "మాభూమి దున్నడానికి నీకు అధికారము లేదు" అని వారు చెప్పిరి. "చూస్తాను" అని జవాబు చెప్పి రామారావు వ్యవసాయోపకరణములను సంపాదింప బూనెను. చేయునది లేక వారు తమ ఆస్తిని పంచుకొని పోయిరి. "ఈమాటు స్వేచ్ఛ. ఇంక నన్ను జమాఖర్చు లడిగేవాడు లేడు" అని రామారావు సంతోషించి తన వాటాకు వచ్చిన రెండుపుట్ల భూమిని దున్నించుటకు బూనుకొనియెను.

రామారావు అత్తగారు గూడ చాల చెప్పించినను లాభము కలుగలేదు. ఆమె భర్త చాలకాలము తహస్సీలుదారీ చేసి చాల ధనము సంపాదించి పోయెను. ఆ కాలములో కనకమ్మ భర్త సంపాదించిన లంచపు రూపాయలను రెండు చేతుల తోడను గూడ లెక్కించుకోలేక విసిగి పోయెడిది. ఆమె గూడ స్వయముగ లంచములు పుచ్చుకొని అనేకుల యుద్యోగములు తీయించి వేయించి అనేకుల కిప్పించెను. రామారావు తన భర్తవలె డిప్యూటీ కలెక్టరీ కాకున్న మానె తహస్సీలుదారీ యైన చేసి లంచములు పట్టి ధనము సంపాదించ వలెననియు తన రెండవ కొమార్త యగు వేంకటలక్ష్మి తనవలెనే ఆ రూపాయలను లెక్కించి జాగ్రత్త చేసికొనుటలో ములిగి యుండవలెననియు నామె కోరికయై యుండెను. ఎట్టి కోరిక కెట్టి ఫలము?

## 3

ఒకానాడు బజాఱు పనిమీద రామారావు రాజమహేంద్రవరము వెళ్ళెను. అత్తగారు పూర్వపుటాదరణము చేయలేదు. ముఖమున చిఱునగవు అంకితము కాలేదు. "అదే కారణమ"ని యాతడూహించుకొని తాను నందులకు తగినట్లే ప్రవర్తింపజొచ్చెను. భోజన సమయమున కనకమ్మ ప్రస్తావము తెచ్చెను.

"వ్యవసాయం చేసి బతకడం మంచిదని మా వంశంలో యెవ్వరూ యెరగరు. మీ వంశం కూడా అలాంటిదే అనుకున్నాను మొదట."

"ఇప్పు డెలాంటి దనుకుంటున్నారూ?"

"తెలుస్తూనే వుంది కదూ?"

"అయితే మీరు చాలా మోసపోయేరన్నమాట. అందుకు నేనేమి చేయగలనూ?"

"మా మర్యాద నిలుపుమని చెబుతున్నాను."

"మీ మర్యాదకి నేను భంగం తేవడం యేమిటీ? అలా అన్నారేమిటండీ అత్తగారూ?"

"నీ క్షేమం కోరి నేను చెబుతూ వుంటే నన్ను హేళన చేస్తావా? ఎన్ని విధాల చెప్పినా గంట నుంచి వకటే మాట. దిక్కుమాలిన వ్యవసాయం ఇదెక్కడ వచ్చిందోయీ మమ్మల్ని యేడ్పించడానికీ?"

"యేడ్పులకీ పెడబొబ్బలికీ యిందేముందీ? వ్యవసాయ్యం చేసేవాళ్ళంతా సిరిసంపదలతోటీ, పాడి పంటలతోటీ సుఖపడి ఆనందిస్తూ వుంటే మీకిప్పుడు యేడవ వలసి యెందుకు వచ్చిందీ?"

"నీతో మాట్లాడ్డమే బుద్ధితక్కువ –"

కనకమ్మ అల్లునకు పెరుగు మానివేసి మజ్జిగ వడ్డించెను. "అవతారం పూర్తి అయింది" అని రామారావు సగసగము తిని లేచెను.

వెంటవచ్చిన పశువుల వాడు రైలు సంచీ సద్దుచుండగా కనకమ్మ ధుమధుమ లాడుచు వాకిటి లోనికి వచ్చెను. "వెడుతున్నాను" అని అల్లుడు చెప్పగా ఆమె మఱింత ధుమధుమలాడుచు మాట్లాడకుండ లోపలకు బోయెను. "జరిమానా వేసింది కాదు నయమే" అని రామారావు బయలుదేరి వెడలిపోయెను.

## 4

"మంగలాడికి బదులు పాలికాపా వెంట రావడం? ఛీ! ఈ పిల్లాడి మొగం గుణాలు మారీ దాకా చూడగూడదు" అని కనకమ్మ అనుకొనియెను. "అన్ని విధాల చెప్పినప్పుడేనా వినగూడదూ? అంత పెంకితనమా? నా మాటకి అడ్డుచెప్పి యే చెఱువు నీళ్ళు తాగుతాడో చూస్తాను" అని గూడ నామె యనుకొనియెను. ఆమె

తమ పరువుకు తగని సంబంధం వచ్చెనేమీ యని తహతహ పడెను. "తన అన్నలు పెద్ద వుద్యోగాలు చేస్తూ వుండడం చూస్తూ వుండిన్నీ బుద్ధి తెచ్చుకోని ఆ పిల్లాడితో నాపిల్ల యెలా కాపరం చేస్తుందీ?" అని పరితపించెను. "మహారాజులాంటి తహసీలుదారు కడుపున బుట్టి అధికారుల యెదట కోతిలాగ వంగివంగి సలాములు చేయవలసిన వ్యవసాయదారుకి పెళ్ళాము కావడానికి నాపిల్ల పూర్వజన్మంలో యెంత పాపం చేసుకుందో" అని కలగుండు వడజొచ్చెను. తుదకు ఆమె వెంకటలక్ష్మికీ సంబంధమును గుదిర్చిన తన తమ్ముడు అగు సూరయ్యను రాయవరము పంపి బుద్ధి చెప్పించిన ఏమయిన ప్రయోజనము కలుగునేమో యని యట్లు చేసెను.

యుక్త సమయమున సూరయ్య రాయవరము వచ్చెను. అప్పుడు రామారావు పొలములో ఆకుమడికి నూతినీరు తోడించుచుండెను. సూరయ్య అక్కడికే పోయి మాటలో మాట కలిపి దిగతీత ప్రారంభించెను. "మీరిందు కోసమే వచ్చారని నాకు తెలుసును. స్వయంగా కష్టపడి రావడం యెందుకూ? మీ అభిప్రాయం వక వుత్తరంలో రాసి తెలపగూడదూ? దానికీ, దీనికీ గూడా జవాబు వకటే. నేను వ్యవసాయం మానను. నా వ్యవసాయపు వృత్తిని చూసి మీ అక్కగారు అంత మండిపడవలసిన కారణం లేదు. ఆవిడ ఉద్యోగానికిచ్చు గౌరవాన్ని వ్యవసాయానికీ, వ్యవసాయానికి ఆరోపించే నైచ్యాన్ని ఉద్యోగానికీ నేను ఆరోపిస్తున్నాను. తహసీలుదారు గారైన తన భర్తతో తరుచు ప్రతీ మకాముకీ పల్లక్కీ మీద వెళ్ళి వైభవాన్ని అనుభవించిన ఆవిడ నావంటి అల్లుడు దొరికినందుకు నేడు చాలా సిగ్గుపడుతోంది. నేనేమి చేయగలనూ? తన కిష్టం లేని వృత్తిలో నేను ప్రవేశించినందుకు ఆమె యెంత విచారిస్తూ వుందో ఇలాంటి మంచి వృత్తిలో ప్రవేశించినందుకు నేనంతకంటె ఆనందిస్తున్నాను. చూశారా తేడా? నా ఆనందం ఆమెకి విచార కారణం అయింది. ఆమె విచారం నాకు లజ్జాకారణం అయింది. చిన్నతనం నుంచీ వొకళ్ళ మీద అధికారం చెలాయించడానికి అలవాటుపడినది కనక ఆవిడ నామీద తన అధికారం చెలాయించదలచి లాభం లేకపోగా పరాభవించింది. అయితే యిందుకు ప్రతిక్రియగా మళ్ళీ నేను ఆమెను పరాభవించదలుచుకోలేదు. ఆవిడ నాకు మర్యాద చేయనక్కర్లేదు. నాకు బహుమతీలు ఇవ్వనక్కర్లేదు. నా భార్యకు నావృత్తి మీద అసహ్యం కలిగించకుండా వుంటే అంతే చాలు. ఈ విషయం మీరు ఆవిడతో గట్టిగా చెప్పడం కంటే మీరు నాకు చేయగల వుపకారం లేదు. మీ మేనగోడల్ని వారు నాకు ఇవ్వదలచిన సంగతి మానాన్నతో చెప్పి సంబంధం కుదర్చడానికి మొదట మీరే వచ్చారు. కనక మీతో యీ సంగతి చెప్పేను." అని రామారావు ఖండితముగ ప్రత్యుత్తరమిచ్చెను.

సూరయ్య స్తబ్ధుడయ్యెను. "ఎంత తొందరపడిందీ అక్కయ్యా?" అని యాతడు ఉలికిపడి రామారావు నెడల ఆమె చేసిన పరాభవము యొక్క పరిమితిని ఊహించుకొని ఆతని హృదయమున జాగరిత మగుచున్న అసంతృప్తి యెట్లు పరిణమించునో యని భయపడుచు వెడలిపోయెను.

# 5

కనకమ్మకు గోరుచుట్టు మీద రోకలిపోటు పడినట్లయ్యెను. సంతాపము, పరాభవము, విచారము, ఉడుకు, దు:ఖము, క్రోధము నొక్కమాఱుగ విజృంభించి యామె నుక్కిరి బిక్కిరి గావించెను. మిన్నంటు మేడమీద నుండి యాకస్మికముగ నీతాకుల గుడిసెలో పడిపోయిన సంపద్గర్వాంధుడు లోకుల మొగము చూచుట కెంత సిగ్గుపడెనో అమె కంత సిగ్గు తోచెను.

వారము దినములలో ఈ సంగతి యిరుగుపొరుగు వారికి తెలిసెను. కొందఱు కనకమ్మ రాగతనమును నిందింపజొచ్చిరి. "ఇదేమి చిత్రమమ్మా? అల్లుడు వ్యవసాయం చేస్తే అత్తగారు మొత్తుకోవాలిటమ్మా" యని కొందఱాశ్చర్యపడసాగిరి. "ఆ యత్తగారి పెంకితనానికీ, ఈ అల్లుడు పట్టుదలకీ సరిపోయింది" అని కొందఱు తీర్మానము చేయసాగిరి. సమీపమున నున్న ఉద్యోగుల భార్యలు వేంకటలక్ష్మిని గుఱించి "దురదృష్టవంతురాలు" అని వగచి తమ భాగధేయములను పొగడుకొనజొచ్చిరి. కనకమ్మ శత్రువులామెకు ప్రాయశ్చిత్తమైనదని సంతసింపజొచ్చిరి.

ఇవి యన్నియు కనకమ్మ చెవిని బడెను. "ఇంతకంటే చచ్చిపోవడం మంచిదీ" అని యామె తహతహపడెను. ఒకనాడు అమె ఈ విచారము వలన కుమిలిపోవుచుండగా వేంకటలక్ష్మి వచ్చి "అమ్మా! తల దువ్వవుటే?" యని యడిగెను. దానిమీద కనకమ్మ హృదయము చేయివెట్టి కలచినట్లయ్యెను. "నీ పాపం బద్దలైపోయింది. నీ సుఖమూ, నీ యానందమూ, నీ గౌరవమూ మంటగలసి పోయాయి. దైవం నిన్ను తోడివారిలో తలయెత్తుకోకుండా చేశాడు. నీ యాశలూ, నీ కోరికలూ, నీ తలపులూ, నీ కల్పనలూ దిక్కుమాలిపోయాయి. ఈడులేని నీ యందమూ, జోడులేని నీ చాకచక్యమూ, పొంగిపోయే నీ లావణ్యమూ అడవిలోకాసిన వెన్నెలలు అయిపోయినాయి. ఇక నువ్వు తలదువ్వుకోవడం యెందుకూ? నువ్వు కాకిముక్కుకు కట్టిన దొండపండువై పోయావు. నీ మొగుడు ఇంత మూర్ఖుడై పోతాడని యెవరనుకున్నారూ? మహారాజు కడుపున బుట్టిన నువ్వు వ్యవసాయదారు పెళ్ళానివౌతావని యెవరు అనుకున్నారూ? నువ్వింత నిర్భాగ్యురాలవై పోతావని యెవరికి తోచిందీ? ఓ దరిద్ర గొట్టు పెద్దమ్మా, నువ్వు పుట్టేకే నా పసుపూ, కుంకుమా పోయాయి. నా మంగళసూత్రం తెగిపోయింది. నా వైభవమూ, నాభోగమూ, నాయానందమూ నీటగలసిపోయాయి" అని యామె విజృంభించెను.

అది చూచి వేంకటలక్ష్మి బెదరిపోయెను. ఆమె కడుపు చెక్కలైపోయెను. వెంటనే నిలువలేక "నేనేం చేశానే?" యని మొదలంట నేలగూలిన చెట్టువోలె కూలబడి "నన్ను తిట్టడం యెందుకూ?" అని రోదనము ప్రారంభించెను. అది చూచి కనకమ్మ కొంచెము సేపు తోకత్రొక్కిన త్రాచువలె బుసలు కొట్టెను; గాని

కొమార్తను లేవనెత్తి "ఏడువకమ్మా! ఏం చెయ్యనూ? మనం చేసుకొన్న పాపం యిలా కట్టి కుదుపుతోంది. మనం పూర్వజన్మంలో చేసుకున్న పాపం కొద్దీ నీకు ఆ కోయవాడు దాపరించేడు. అయితేలే నీకు వచ్చిన లోపం యేమీ లేదు. నేను నీ కష్టాన్ని చూడలేను. నీ గౌరవాన్ని పోగొట్టలేను. నువ్వు ఆ కోయవాడితో – ఆ మంగలివాడితో కాపరం చేయనక్కర్లేదు. ఇక్కడ వుండి నువ్వే నా భాగ్యం అంతా అనుభవించు. ఈ మేడా, పొలాలూ, రొక్కమూ, అంతా నీదే. ఆ నీచుడికి ఇక్కడ వుండే నువ్వు పరాభవం చెయ్యి. వాడి సౌఖ్యాన్నీ, వాడి ఆనందాన్నీ, ఇక్కడ వుండే నువ్వు బుగ్గి చెయ్యి. వాడికి ఇక్కడ వుండే నువ్వు గర్వభంగం చెయ్యి" అని యామె కొమార్త నూరడించెను.

## ⑥

ఆఖుమాసాలకు వేంకటలక్ష్మి రజస్వలయయ్యెను. కనకమ్మ ముఖమున ఎవరికిని ఆనంద చిహ్నములు కాన్పింపలేదు. వేంకటలక్ష్మి గూడ ఉత్సాహముతో నున్నట్లు కాన్పింపలేదు. కనకమ్మ రాయవరము శుభలేఖ పంపలేదు. ఒకరిద్దరు బ్రాహ్మణులు వచ్చి "రాయవరం శుభలేఖ యెప్పుడు పంపుతారూ?" అని యడిగిరి; అందులకామె "అక్కర్లేదు" అని జవాబు చెప్పెను. మూడు మాసముల కీసంగతి కర్ణాకర్ణిగా రాయవరమున తెలిసెను. రామారావు తల్లి తెల్లవోయెను. రామారావు ఆలోచనము ప్రారంభించెను. మాతాపుత్రులకు అయిదారు పర్యాయములు ఈ ప్రస్తావనము జరిగెను; అందు రామారావు వేంకటలక్ష్మి యెడల ఆశ వదలుకొనినట్లు ధ్వనించెను.

వెంకమ్మ భీతయై పెద్ద కొడుకునకు జాబు వ్రాయించెను. ఆతడు వచ్చి సంగతి యంతయు విని మాట్లాడెను; గాని రామారావు వినలేదు. ఆతని యన్న రాజమహేంద్రవరము వెళ్ళి మాట్లాడగా "నీ తమ్ముడు వ్యవసాయం మానాలి" అని కనకమ్మ బదులు చెప్పెను. ఆతడు ఆ సంగతి తల్లికి తెలిపి వెడలిపోయెను.

"అమ్మా! ఇప్పుడేమంటావూ?"

"వ్యవసాయం మానరా నాయనా!"

"ఈ జన్మంలో కాదు."

"పిల్ల మన యింటికి వచ్చిందాకా –"

"అదేమన్నమాటా? ఇందేమి తప్పు వున్నదీ?"

"ఆ పెంకిమనిషి పట్టు పట్టింది కనక"

"ఆవిడ పట్టుపట్టడమూ, నేను లొంగడమూనా?"

"పాలకోసం రాయి మొయ్యాలిరా."

"కోడలి కోసం నువ్వు పలవరిస్తున్నావేమిటే అమ్మా?"

"కాదుటరా నాయనా!"

"సరే. ఆలోచిస్తాను. తొందరపడకు."

ఈ ప్రస్తావన జరిగిన మఱునాడు రామారావు పనియున్నదనీ, వా౹మ్ము దినముల వరకు రాననీ చెప్పి కాకినాడకు వెళ్ళెను. మఱునాడు "నిలిచియున్నట్లు రావలసినది" అని రామారావు తల్లికి తంతి గొట్టెను. "ఏమి యాపత్తో" అని జంకుచు వెంకమ్మ వేంకటశాస్త్రి అను పొరుగింటి బ్రాహ్మణుని తీసుకొని కాకినాడ వెళ్ళగా అప్పటికి రామారావు పెండ్లిపీటల మీద కూర్చుండి తలంబ్రాల తొందరలో నుండెను. అది చూచి వెంకమ్మ నిర్విణ్ణి కాగా రామారావు చేసిన కనుసన్న గ్రహించి పెండ్లికొమార్త తండ్రి ఆమెను స్త్రీలున్న చోటికి తీసికొని వెళ్ళెను.

ఆశీర్వచనము అయిన తరువాత రామారావు తల్లికిని, అత్తమామలకును మఱికొందఱు బంధువులకును నూతన వధువుతో గూడి నమస్కరించి పిదప ఒక వివిక్త ప్రదేశమున గూర్చుండి తల్లితో మాట్లాడెను.

"నీ క్రొత్తకోడలు తండ్రి యిక్కడ వృద్ధిపొందుతూ వున్న ప్లీడరు. కూతురు కట్టుతప్పివుండడమూ, నీ కొడుక్కీ ఆయనకీ చాల కాలాన్నించి స్నేహం వుండడమూ, నీ కొడుకు మొదటి అత్తగారు పెంకిపట్టు పట్టికూచోడమూ, ఇలాంటి సందర్భాలచేత ఈ పెళ్లి అయింది. ముందు మూఢం వస్తూ ఉండటంచేత వివాహం యింత అవ్యవధిగా జరిగింది" అని యామె నెఱిగిన యొక పెద్దమనుష్యుడు చెప్పెను. నాకబలి యైన తరువాత రామారావు తల్లిని, నూతన వధువును వెంటనిడుకొని రాయవరము ప్రవేశించెను. గ్రామవాసులందఱు నాశ్చర్యపడిరి.

ఈ సంగతి యుక్తసమయమున రాజమహేంద్రవరములో తెలియగా కనకమ్మ "పోనీ. శని విరగడై పోయింది" అనియెను. వేంకటలక్ష్మి మాత్రము అప్రతిభ యయ్యెను.

## 7

రజస్వలయైన పిల్ల, ఉన్న యింటి పడుచు. భాగ్యవంతుల కోడలు. ఏమి లోటు? మోహావేశమునకు అన్నియు కారణములే. రామారావు అందగాడు. హిందూ గృహిణులకు ప్రణయము పెండ్లినాడే యారంభమగును. వేంకటలక్ష్మికి గూడ ఇన్నియు గావలసినవే; గాని కనకమ్మ యౌద్ధత్యము నెదుట నవి పనిచేయలేకపోయినవి. తహస్సీలు దారు కూతురు కనుక తల్లి బోధనలు చెవి కెక్కుట వలన వ్యవసాయదారుని గుఱించి ప్రణయ కల్పనలు చేసికొనుట వేంకటలక్ష్మికి దర్జా తక్కువగా తోచెను. రామారావు తన్ను పెండ్లియాడెను. మగడు. అంతే యామె యాలోచించెను. కనకమ్మ "మారుమనువులు యెందుకు లేకపోవాలి?" అనుకొనియెను.

రామారావు రెండవ భార్య - సుభద్రమ్మ పెండ్లియైన మూడు మాసములకు రజస్వల యయ్యెను. ఆరవ మాసమున పునస్సంధానమయ్యెను. సారెతో గూడ ఆమె భర్త యింట ప్రవేశించెను. అప్పుడే ధాన్యలక్ష్మియు ఇంటికి వచ్చెను. వెంకమ్మ "సుభద్ర అదృష్టవంతురాలు" అనుకొనియెను. రామారావు "బాగా పండింది. ఈ పిల్ల కాలు పెట్టిన వేళ మంచిదీ" అని యానందించెను.

కనకమ్మ పెద్దకూతురు పద్మాక్షి మగడు విశాఖ పట్టణమున పోలీసు శాఖలో సర్కిల్ ఇన్స్పెక్టరీ చేయుచుండెను. తన పెద్దకూతురు తనవలె లంచపు రూపాయలు లెక్కించుకొనుచు కూర్చున్నందులకు కనకమ్మ కానందముగనే యుండెను; గాని అల్లుడు మాత్రము ఆమెకు లక్ష్యపెట్టలేదు. "ఏమిటీ నీ యౌద్ధత్యమూ? ఇక చాలించు." అని యాతడు ఆమెను తిరస్కరించెను. అత్తకును అల్లునకును మొదట మాటలు తప్పిపోయాను. ఆ వెంటనే ముఖావలోకనములకు గూడ అట్టి గతియే పట్టెను. అతడు ఆఱు సంవత్సరముల క్రిందట అత్తగారితో పేచీపడి భార్యను తీసికొనిపోయెను. మఱల నాతడు రాజమహేంద్రవరము రాలేదు. పద్మాక్షిని గూడ పంపలేదు.

ఒక పంచముడు వ్యభిచార దోషమునకు కినిసి భార్యను నఱికి పాఱిపోయెను. ఆచూకీ వలన వాడు చీరాలలో నున్నాడని తెలిసి పట్టుకొనుటకు పద్మాక్షి మగడు చీరాల వెళ్ళెను; హంతకుడు దొరకుట యలలలో నుండెను. ఉన్నట్లుండగా జ్వరము వచ్చి యాతడు మంచము పట్టెను. ఆరోజులలో చీరాల ప్రాంతమున ప్లేగు జాడ్యము చెలరేగి యుండెను. అక్కడి పోలీసు వారనుమానించిరి. మఱునాడు సాయంత్రమునకు ప్లేగు నిశ్చయమై పద్మాక్షి మగడు చనిపోయెను. శోకముతో బాటు మగనియాస్తి పట్టుకొని వచ్చి పద్మాక్షి రాజమహేంద్రవరమున తల్లియింట ప్రవేశించెను.

## 8

మగడు పోయిన దొకతె. మగనిని విడిచిన దొకతె. కనకమ్మ సంతానము ఇట్టి స్థితిలో నుండెను. పద్మాక్షి స్థితి యామెకు చాల విచార కారణమయ్యెను. డబ్బు దొరకుచున్న రోజులలో భర్త పోవుటయును, సంపాదించిన ధనము ననుభవించుటకు బిడ్డలు లేకుండుటయు పద్మాక్షికి రెండు చిక్కులు వచ్చెను. వీని దలచికొని కనకమ్మ చాల విచారించెను; గాని వేంకటలక్ష్మిని గుఱించి యామెకేమియు వగపు లేకుండెను. రామారావునకు తనకును ప్రవర్తిల్లిన పోరాటమున వేంకటలక్ష్మి తనకు విజయపతాక యని యామె గర్వించుచుండెను.

రామారావునెడల తాను చేసిన ప్రతిక్రియను కనకమ్మ చాల గర్వముతో చెప్పగా పద్మాక్షి చకితయై రహస్యమున వేంకటలక్ష్మితో సంభాషించెను. ఆమె మాటలలో గూడ నట్టి భావమే ప్రస్ఫుటము కాగా పద్మాక్షి ఉలికిపడియెను. "లేక

నేనూ, ఉండి అదీ సమానంగా వున్నాము" అని యనుకొని యామె వేంకటలక్ష్మితో రహస్య సంభాషణము ప్రారంభించెను.

"నన్ను విడిచిపెట్టవచ్చునా?"

"ఏం చేస్తాడూ? అమ్మ నీ కొంప తీసింది. అమ్మ మాటలు విని నువ్వు మొండికెత్తేవు."

"ఆయన మాత్రం మొండికెత్తలేదూ?"

"మొగాడికి చెల్లుతుంది."

"నాకెందుకు చెల్లదూ?"

"ఇదే అమ్మ నీకు చేసిన వుపకారం."

"వ్యవసాయం యెందుకు చెయ్యాలీ?"

"చేస్తే యేం పోయిందీ?"

"నలుగురిలో తల యెత్తుకు తిరగడం యెలాగా?"

"ఇప్పుడేం వచ్చిందీ?"

"తాసిల్దారు కూతురు వ్యవసాయదారు పెళ్ళామా?"

"ఆలోచించుకో. తాసిల్దారు వొకరికి నౌకరు. వ్యవసాయదారు వొకరికి యజమాని. తాసిల్దారులూ, కలకటేరులూ, గవినేరులూ అసలు వ్యవసాయదారులకి సాయం చేయడానికే పుట్టేరుట. మీ బావ చెప్పేరు చాలామాట్లు. "నిజానికి నేను నౌకర్ని. మాతమ్ముడు యజమాని" అన్నారు మీ బావ యెన్నో మాట్లు."

"అమ్మకి కంటే బావకి యెక్కువ తెలుసునుటే?"

"నిజమే. కొంపలు తీయడం వారికి తెలవదు."

"అదేమిటే అక్కయ్యా, అలా అంటావూ?"

"అనడానికేం వుందీ? అమ్మ నీ కొంప తీసింది."

"ఆయన ఇంకో పెళ్ళాన్ని యెందుకు పెళ్ళాడాలీ?"

"అమ్మ నిన్ను పంపకపోతే యేం చేస్తాడూ?"

ఇట్లు రెండుమాసములు వాదోపవాదములు జరిగెను. వేంకటలక్ష్మి మనస్సు మగని మీదికి పోయెను. నిజముగా అప్పటికామె రాక్షసభావము పోయి మానవ భావము కలిగెను. "అయితే వారిని తీసుగురా" అని వేంకటలక్ష్మి చెప్పెను. ఆమె ఇప్పుడు తహస్సీలుదారు కూతురు గాదు. ఆశ్రయము లేని అనాథ.

పద్మాక్షికి మార్గము తోచలేదు. ఆలోచనల మీద ఆలోచనలు వచ్చి పడిపోయెను. ఆయాలోచనా సమూహము నుండి నిశ్చయజ్ఞానము కలిగెను. చెల్లెలు నిమిత్తము తాను భిక్షకురాలగుట తప్ప ఇప్పుడు వేఱుదారి కాన్పింపలేదు.

# 9

సంగతి యంతయు అతి రహస్యముగా చెప్పి మేనమామ యగు సూరయ్య నామె రహస్యముగా రాయవరము పంపెను. వెంకమ్మ నాయభ్యంతరము లేదనియెను. రామారావు "ఆవిషయమున నాకు పెత్తనము లేదు. మీ మేనగోడలి స్థానమిప్పుడెవ్వరి వశమున నున్నదో వారి యుత్తరువు కావలెన"నియెను. సంధాన చతురుడగు సూరయ్య సుభద్ర మనసు కరిగించెను. ఆమె తన యంగీకారమును తెలుపుటకు సిద్ధముగా నుండగా రామారావు అందుకొని "ముందు తండ్రిగారితో సంప్రతించుకోనియ్యండి" అనియెను. వెంటనే సుభద్ర యావాక్యమును శుకానువాదముగా చెప్పగా సూరయ్య నిరాశ చేసికొనియెను.

"మామయ్యా, నిరాశ అక్కర్లేదు. తన కూతురు వంటిది గాదూ?" అని ధైర్యము చెప్పి పద్మాక్షి చొల్లంగి తీర్థము మిషతో మేనమామతో కాకినాడ వెళ్ళెను. కూతుళ్ళను కన్నవాడగుటచే సుభద్రమ్మ తండ్రి అభ్యంతరము చెప్పలేకపోయెను. ఆమె తల్లి "ఆడపుట్టుక కాదుటమ్మా? నాతో యింతగా చెప్పాలా?" అనియెను. "మీరు వెళ్ళి తరవాయి ప్రయత్నాలు చేసుకోండి. మాపిల్ల అభ్యంతరం లేదు. నేను కబురు పంపుతాను" అని సుభద్ర తండ్రి చెప్పగా పద్మాక్షి రాజమహేంద్రవరము వెడలిపోయెను.

పద్మాక్షి కాకినాడ వెళ్ళిన గడియకు వేంకటలక్ష్మి హృదయము ప్రణయపూర్ణ మయ్యెను. నాలుగు సంవత్సరముల ప్రణయ వేగము భర్త ముఖమైన చూడని జవరాలికి సహింపదగినది కాదని చెప్పనక్కఱలేదు. అక్కడ పద్మాక్షి రాయబారము నెఱపుచుండగా ఇక్కడ వేంకటలక్ష్మి మంచము పట్టెను. అక్క వచ్చి చూచి "యేమిటే?" అనగా "ప్రారబ్ధం. చేసుకున్న కర్మ అనుభవానికి వచ్చింది. వారి మొగమేనా చూపించు. అంతే చాలు" అని చెల్లెలు బదులు చెప్పెను. "భరవా లేదు" అని యామె పైకి ధైర్యము చెప్పెను; గాని లోపల "ఈ వుద్ధృతం దాటడం యెలాగా?" అని తహతహపడసాగెను.

నిముసముల మీద సూరయ్య రాయవరము వెళ్ళి మాట్లాడెను. మామగారు కబురు చేయగా అతడు వచ్చిన గంటకు రామారావు సుభద్రతో కాకినాడ వెడలిపోయెను.

వేంకటలక్ష్మికి అంకాపొంకాలమీద జ్వరము కాయుచుండెను. జరుగుచున్న దేమియు నెఱుగని కనకమ్మ ఎక్కువ డబ్బు కోరని వైద్యుని రప్పించెను. "శీతపైత్య జ్వరమూ యిది. ఏడు లంకణాలు కట్టాలి. అల్లపురసంతో పొద్దున్నా, మిరియాల రసంతో సాయంత్రమూ యివ్వండి" అని చెప్పి శీతాంశురసము ఇచ్చి వెడలిపోయెను. "చెల్లెల్ని నువ్వు చూస్తూవుండమ్మా" అని కనకమ్మ పద్మాక్షికి చెప్పెను. "సరే" యని యామె ముందు సంగతి యోచింపసాగెను. కనకమ్మ వైద్యుడు చెప్పిన రసములు పొంగించి వడపోసి యీయగా ఆమె వెనుక చేసికొని వెళ్ళిన తరువాత పద్మాక్షి

వానిని తూముకాల్వలో పారపోసి వేయజొచ్చెను. అపుడపుడు కనకమ్మ "వైద్యుడు చాలా తెలివైనవాడమ్మా! భయం లేదు" అని వేంకటలక్ష్మిని బుజ్జగించుచుండును.

వారము దినములు గడిచిపోయెను. స్థితిగతులు విషమించుట కున్ముఖములై యుండెను. రాయవరము నుండి గాని, కాకినాడ నుండి గాని వర్తమానము రాలేదు. "మామయ్యా, చూస్తూ వూరుకుంటే యెలాగా? కాకినాడ వెడదాం రావయ్యా" అని పద్మాక్షి బయలుదేరెను. "బుల్లెమ్మకిలా వుండగా నీకు కాకినాడ ప్రయాణం యేమిటే?" అని తల్లి యడుగగా నామె "నీకు తెలవదు వూరుకో"అని జవాబు చెప్పి వేంకటలక్ష్మిని చూచుచుండుమని సూరయ్యను నిలిపి వేసి అతని కుమారుని దీసికొని కాకినాడ వెళ్ళెను.

"ఇప్పుడు దీనికి కాకినాడ వెళ్ళడం దుర్బుద్ధి యేమిటిరా?" అని కనకమ్మ యడిగెను; గాని సూరయ్య తనకు దెలియదని చెప్పెను. కనకమ్మ మందు నిమిత్తము వెదకి అది కనబడకపోగా మఱల వైద్యుని రప్పించెను. "వాతంపోయి శ్లేష్మం ప్రవేశించింది. అంచేతే దాహం కట్టింది. హార్లిక్సుపాలు పోస్తే మంచిది. ఇక మందు అక్కర్లేద"ని చెప్పి వైద్యుడు వెడలిపోయెను. "నీకేం తెలుసును?" అని యనుకొని కనకమ్మ "మందులేకపోతేలే" అని అల్లపురసము తెచ్చి యీయగా వేంకటలక్ష్మి నెత్తిమీద బాదుకొని "అమ్మా మందులకి కుదిరేది కాదే యీరోగమూ? నా కొంపతీశావే నువ్వూ" అనిఏడువదొడగెను.

ఇక నేమున్నదీ? కనకమ్మ కంతయు దెలిసిపోయినది. "పెద్దముండ యింటో చేరి నాకొంప ముంచింది" అని యామె అవతారము నెత్తెను. ముఖము చిట్లింపులు, రుసరుసలు ప్రారంభమై వ్యవహారము పూర్తిగ ముదిరెను. ఆమెను శాంతింపజేయుటకు అనేక విధముల బ్రయత్నించియు సూరయ్య విఫలప్రయత్నుడయ్యెను. "మామయ్యా, నువ్వు ఆ రాక్షసికి జవాబు చెప్పకు. గడియల్లో వుంది నాపని. ఈ మధ్యాహ్నంబండి మీద వస్తారా? బతుకుతాను" అని వేంకటలక్ష్మి చెప్పెను.

## (10)

పదిగంటలయినవి. చలి శాంతించెను. ఇరుగు పొరుగు స్త్రీలు అయిదారుగురు భర్తలను కచేరీలకు బంపివేసి భుజించి వేంకటలక్ష్మిని చూచుటకు వచ్చిరి. సూరయ్య స్థాణువు వలె మంచము వద్ద కూర్చుండెను. వచ్చినవారు నిశ్శబ్దముగ కూర్చుండి చూచుచుండిరి. కనకమ్మ నిప్పులు త్రొక్కిన కోతివలె చిందులు త్రొక్కుచుండెను. గోదావరి గట్టుమీది సామాను రైలు కూత కూయగా వేంకటలక్ష్మి "మామయ్యా, అది రైలేనా?" అని యడిగెను. అందులకు ఆతడు సమాధానము చెప్పునంతలో వీధిలో నొక మోటారు వచ్చి నిలిచెను.

లోపలనున్న స్త్రీలు తొంగి చూచిరి. సూరయ్య లేచి గుమ్మము లోనికి వచ్చెను. కనకమ్మ విరగబడి చూచెను. ఇంతలో పద్మాక్షి మోటారు దిగి యొక్క అంగలో లోపలకు బోయి చెల్లెలు మీద చేయి వైచి "వచ్చారమ్మా" అనియెను. వేంకటలక్ష్మి మూసిన కండ్లు తెఱుచునంతలో సుభద్ర వచ్చెను. వేంకటలక్ష్మి కన్నులు గిఱ్ఱున తిరుగుచుండగా పద్మాక్షి యామెకు సుభద్రమ్మ నెఱుకపఱిచెను. "అక్కయ్యా, నింపాదిగా వుందా?" అని సుభద్ర యడుగగా "నన్ను రక్షించవూ?" అని వేంకటలక్ష్మి యడిగెను. ఇంతలో రామారావు లోపల ప్రవేశించెను. పద్మాక్షి "రండి" అని కన్నుల నీరు గ్రక్కుకొనుచు ఓసరిల్లెను. సుభద్ర ప్రక్కకు జరిగెను. ఇరుగుపొరుగు స్త్రీలు లేచి నిలిచిరి. సూరయ్య మంచము వద్ద నిలిచెను. అప్పుడు రామారావు ప్రక్కలో గూర్చుండి "నన్ను క్షమించు" అని వేంకటలక్ష్మి చేతులు పట్టుకొనియెను.

వేంకటలక్ష్మికి ఉక్కిరిబిక్కిరి యయ్యెను. "పాపాత్మురాలిని. నాకు శరీరం తెలియలేదు. దుర్బోధలలో పడిపోయెను. అమృతపు కుండని తన్నుకున్నాను. రక్షించండి. దర్శనం యిచ్చారు. చాలు. నన్ను మరిచిపోండి. చెల్లాయిని అనుగ్రహించండి. నాకింతే చాలు. పాపపు కళ్ళకి ఇక దర్శనమేనా లేదనుకున్నాను" అని యామె ఆయాసము వలన ఊరుకుండగా అందఱును "అధైర్యపడకు" అనిరి. రామారావు ఆమె రెండు చేతులును గట్టిగా పట్టుకొనియెను.

కనకమ్మకు నోట మాట రాలేదు. ముఖము తుమ్మలలో ప్రొద్దు గ్రుంకినట్లుండెను. పద్మాక్షి పడకి పోవుచుండెను. ఇరుగు పొరుగు స్త్రీలు అవశలై యుండిరి. సుభద్ర హృదయము కంపించి పోవుచుండెను. సూరయ్య స్తబ్ధుడై యుండెను. అప్పుడు వేంకటలక్ష్మి రామారావు మెడలో చేతులు వేసి ముఖము దగ్గరకు వంచికొని దుర్బలములగు పెదవులతో ముద్దుగొని విడిచెను. రామారావు ఆమె యింగితము నెఱింగి వాడిపోయిన యామె కపోలమున ఒక ముద్దు ఉంచెను.

వేంకటలక్ష్మి ఐహిక జీవితమున లభించిన ప్రణయభరితమగు ముద్దు ఇది యొక్కటియే. ఇదియే యామెకు మొదటి ముద్దును, కడపటి ముద్దును గూడ నయ్యెను.

అందఱును యంత్రపు బొమ్మలవలె నుండిరి. చూచుచుండగా రామారావు కన్నులనుండి బాష్పబిందువులు జాఱెను. "బాబుగారూ, చూస్తారేమీ" అని యాతడు చెప్పగా అందఱును గొల్లుమనిరి. "చెల్లాయి, నన్ను విడిచిపోతున్నావా?" యని పద్మాక్షి రోదనము ప్రారంభించెను. రామారావు ఉత్తరీయముతో ముఖము కప్పుకొని యేడువ జొచ్చెను. సుభద్ర అప్రతిభ యయ్యెను.

❀ ❀ ❀